సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 9 । ఆగస్టు । 2025

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమపూజ, గణపతి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు క్రీడల్లో రాణించాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



విద్యార్థినులను అభినందిస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: క్రీడల్లో బాలికలు రాణించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. ఇటీవల హనుమకొండలో జరిగిన 34వ సౌత్ జోన్ మీట్‌లో భద్రాచలానికి చెందిన పృథ్వీక జావెలిన్ త్రోలో రెండో స్థానం, ఎస్‌కే అమ్రిన్ 100 మీటర్ హ్యాండిల్స్‌లో రెండో స్థానం సాధించారు. శుక్రవారం పీఓ వారిని తన చాంబర్‌లో అభినందించారు. ఇదే స్ఫూర్తి కొనసాగిస్తూ జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని సూచించారు. కాగా పీఓ రాహుల్ ఒక ప్రకటనలో రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కుంజా ధర్మ, పూణేం కృష్ణ, గుండు శరత్, కనితి రాధ, శ్రీదేవి, నాగమణి, కోచ్‌లు జున్ను, గిరి ప్రసాద్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

భద్రాచలంటౌన్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు ఆదివాసీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు సహకరించాలని ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్ తెలిపారు. శుక్రవారం ఆయన సమితి సభ్యులతో సమావేశమై ఆదివాసీ వేడుకల ఏర్పాట్లపై మాట్లాడారు. అతిథులకు ఆదివాసీ వంటకాల రుచి చూపించాలని చెప్పారు. శనివారం వివిధ ఆదివాసీ తెగల గిరిజనులతో ర్యాలీ నిర్వహిస్తామని, మహనీయులకు విగ్రహాల వద్ద నివాళి, జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ప్రతినిధులు పూనెం కృష్ణ, కుంజా ధర్మ, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

పులి సంచారంపై అటవీశాఖ అప్రమత్తం

ఇల్లెందురూరల్: పాఖాల కొత్తగూడెం సమీపంలోని రాంపూర్ అటవీ ప్రాంతంలో పశువును చంపిన ఘటనతో పులి సంచరిస్తున్నట్లు శుక్రవారం అక్కడి అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. పులి పాఖాల కొత్తగూడెం నుంచి పాండవుల గుట్ట మీదుగా గుండాల మండలం వైపుగా సంచరిస్తుందని గతంలో చోటుచేసుకున్న ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. శుక్రవారం రాంపూర్, లక్ష్మవరం మధ్య అటవీప్రాంతంలో పులి ఉన్నట్లు ధ్రువీకరించిన అటవీశాఖ అధికారులు, దాని సంచారంపై నిఘా పెంచారు. ఈ క్రమంలో జిల్లా అటవీశాఖ అధికారులు సైతం అప్రమత్తమయ్యారు. పాఖాల కొత్తగూడేనికి సమీపంలో ఉన్న ఇల్లెందు, కొమరారం, గుండాల రేంజ్ అధికారులు అప్రతమత్తమై అడవిలో నిఘా పెంచినట్లు ఇల్లెందు ఎఫ్‌డీఓ కరుణాకరాచారి తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పులి సంచరిస్తే పాదముద్రలను సులువుగా గుర్తించవచ్చని పేర్కొన్నారు. అటవీ సమీప గ్రామాల ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాకు 3వేల మెట్రిక్ టన్నుల యూరియా

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి ఖమ్మం జిల్లా అవసరాల కోసం 3,001 మెట్రిక్ టన్నుల క్రిబ్‌-కో యూరియా సరఫరా అయింది. ఖమ్మం జిల్లా పందిళ్లపల్లి రైల్వే రేక్ పాయింట్‌కు యూరియా చేరగా.. ఖమ్మం జిల్లాకు 1,501, భద్రాద్రి జిల్లాకు 1,400 మెట్రిక్ టన్నులు సరఫరా చేశారు. మిగిలిన 100మెట్రిక్ టన్నులను బఫర్ స్టాక్‌గా నిల్వ చేశారు. జిల్లాల వారీగా కేటాయించిన యూరియాను పీఏసీఎస్‌లు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల ద్వారా విక్రయిస్తారు.

స్ఫూర్తి పూసుకుంట..

ఆదివాసీ గ్రామంలో సంక్షేమ, అభివృద్ధి ఫలాలు



పూసుకుంట నుంచి అర్లపెంట క్రాస్ వరకు అటవీ మార్గంలో నిర్మించిన హై లెవెల్ వంతెన

- పాలకులు, అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రగతి
- గిరిజనుల సామాజిక జీవనం మెరుగుపడే అవకాశం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఏటా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఆదివాసీల జీవన విధానం, వారి ఆహారపు అలవాట్లు, సంస్కృతీ సంప్రదాయాల గురించి ప్రజాప్రతినిధులు, అధికారులు ఎంతో గొప్పగా చెబుతారు. ఆ రోజు గడిస్తే మళ్లీ వారి జీవితాల్లోకి రోడ్డు సౌకర్యం లేకపోవడం, కరెంటు ఉండకపోవడం, తాగునీటి కోసం తండ్లాట వంటి సమస్యలు వచ్చి చేరతాయి. వీరి జీవితాల్లో వెలుగు నింపాలని ప్రజాప్రతినిధులు గట్టిగా సంకల్పం తీసుకుంటే అధికారులు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే సంక్షేమం, అభివృద్ధి కిరణాలు ఎంత వేగంగా ఆదివాసీ జీవితాల్లోకి వస్తాయనేందుకు.. దమ్మపేట మండలంలోని పూసుకుంట గ్రామం నిదర్శనంగా నిలుస్తోంది.

నాటి గవర్నర్ గ్రామాన్ని సందర్శించాక..

స్వాతంత్రం వచ్చిన తర్వాత దశాబ్దాలపాటు దట్టమైన అడవిలో ఉండిపోయిన ఈ గ్రామం ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలకు దాదాపుగా దూరంగా నిలిచిపోయింది. 2021 ఏప్రిల్‌లో అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రత్యేకంగా సందర్శించడంతో ఒక్కసారిగా పూసుకుంట గ్రామం వెలుగులోకి వచ్చింది. అక్కడి ప్రజల కష్టాలను చూసి ఆమె చలించిపోయారు. తాగునీటి సౌకర్యం కోసం ఆర్వో ప్లాంటు, ఈవీ ఆటో, వెదురు బొమ్మల తయారీ శిక్షణ కేంద్రానికి నిధులు మంజూరు చేశారు. కొన్నాళ్లు పని చేసిన ఆర్వో ప్లాంటు మూతపడగా శిక్షణా కేంద్రం అలంకారప్రాయమైంది. ఈవీ ఆటో రిపేర్లకు వచ్చి మూతపడింది. అంతకుముందు చరిత్రను పరిశీలించినా కేవలం నలుగురు ఎమ్మెల్యేలు మాత్రమే గ్రామాన్ని సందర్శించారు. అది కూడా సాధారణ ఎన్నికల ప్రచారం కోసమే వచ్చినట్టుగా రికార్డులు పేర్కొంటున్నాయి. కొండరెడ్లు ఇతరులతో కలవకుండా దట్టమైన అడవుల్లో వేరుగా ఉండటం, ఓటర్ల సంఖ్య కూడా తక్కువగా ఉండటంతో అధికారులు, రాజకీయ పార్టీలు వీరిని పట్టించుకోలేదు. ఈ విషయం గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత సాక్షి కథనాల ద్వారా వెలుగులోకి వచ్చింది.

యాక్షన్ ప్లాన్

గడిచిన ఏడాది కాలంగా కొండరెడ్లు జీవిస్తున్న పూసుకుంట గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఆర్ అండ్ బీ అధికారులు, ఫారెస్టు శాఖలను సమన్వయం చేసుకుంటూ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించే పనులు ఈ ఏడాది జనవరిలో మొదలెట్టారు. ప్రస్తుతం రూ. 5 కోట్ల వ్యయంతో మూడు వంతెనల నిర్మాణం పూర్తికాగా, రోడ్డు పనులు కంకర పరిచే దశలో ఉన్నాయి. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే నిర్వహించి, వారి నైపుణ్యం ఆధారంగా తేనెటీగల పెంపకం, టెంట్ హౌస్, రెండు పవర్ టిల్లర్లు మంజూరు చేశారు. వ్యవసాయం చేస్తున్న 20 కుటుంబాలకు 12 బోర్లను ఉచితంగా మంజూరు చేశారు. 22 కుటుంబాలకు ఇళ్లను మంజూరు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సుగా ఉపయోగించుకునేందుకు వీలుగా గతంలో మూలన పడిన ఈవీ ఆటోను రిపేర్ చేయించి అందుబాటులోకి తెచ్చారు.



పూసుకుంటలో కొండరెడ్ల కోసం ఐటీడీఏ మంజూరు చేసిన సాగునీటి బోరు



గ్రామంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్

వెదురు బొమ్మలే జీవనాధారం..

పూసుకుంట గ్రామం వెళ్లాలంటే దమ్మపేట–పాల్వంచ ప్రధాన రహదారి నుంచి దట్టమైన అడవిలో 13 కి.మీ పాటు కాలిబాటన ప్రయాణించాలి. వానాకాలం వచ్చిందంటే బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. మిగతా కాలాల్లో కొన్ని ఆటోలు, టూ వీలర్ల ద్వారా గ్రామానికి రాకపోకలు సాగుతాయి. అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో రోడ్లు, మిషన్ భగీరథ పథకం గ్రామానికి చేరుకోలేదు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో వానలపై ఆధారపడి సాగే వ్యవసాయంతో పాటు వెదురు బొమ్మల తయారీనే ప్రజల ప్రధాన జీవనాధారంగా మారింది.

నామ్‌కే వాస్తేగా కాకుండా

ఆర్థికంగా, సాంఘికంగా వెనుకబడిన గిరిజనులు, ఆదివాసీల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతోంది. ఐటీడీఏల పేరుతో ప్రత్యేక సంస్థలను నెలకొల్పి అనేక పథకాలను అందుబాటులో ఉంచింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా కొన్ని పథకాలు లేకపోవడం, మరికొన్ని కాలానుగుణంగా మారకపోవడంతో ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదు. గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం చేస్తున్న వ్యయం అంతా బినామీలకు, గుత్తేదారులవశం అవుతుందనే విమర్శలు ఉన్నాయి. ఆదివాసీల పల్లెల్లోకి వెళ్లి వారి జీవితాలను, ఆర్థిక స్థితిగతులను దగ్గరుండి పరిశీలించి పథకాలు అమలు చేస్తే మార్పు త్వరిత గతిన వస్తుందనే అభిప్రాయానికి పూసుకుంట గ్రామం వేదికగా మారింది.

పీవీటీజీలుగా కొండరెడ్లు

ఆదివాసీల్లో కోయ, గోండు, గొత్తికోయ తదితర జాతులు ఎన్నో ఉన్నాయి. వీరిలో బాగా వెనుకబడిన జాతుల్లో కొండరెడ్లు ఉన్నారు. ఆదివాసీల్లో ఎక్కువ శాతం అడవుల్లో జీవించేందుకు ఇష్టపడితే, ఆ అడవుల్లో కొండలపైనే జీవించడం కొండరెడ్ల ప్రత్యేకత. కొండ కిందకు తీసుకువచ్చేందుకు చేసిన ప్రయత్నాల వల్ల ప్రస్తుతం కొండరెడ్లు కిందకు వచ్చి అడవిలోనే ఊళ్లను ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. కొండరెడ్లను ప్రిమిటివ్ ట్రైబల్ గ్రూప్ (అరుదైన ఆదిమజాతి)గా 1975లో కేంద్రం గుర్తించింది. ఆ తర్వాత కాలంలో వీరి జనాభా వేగంగా తగ్గిపోతుండటంతో 2006లో కొండరెడ్లను పీవీటీజీ (పర్టిక్యూలర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్) కేటగిరీలోకి మార్చారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

- రామాలయంలో సామూహిక కుంకుమార్చన
- నేడు హయగ్రీవ జయంతి అభిషేకం

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శ్రావణ మాస రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఉపాలయంలోని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారికి ఉదయం ప్రత్యేక స్నపనం, పంచామృతంతో అభిషేకం జరిపారు. సాయంత్రం బేడా మండపంలో పల్లకీ సేవగా స్వామివారి ఉత్సవమూర్తులను, అమ్మవారి ప్రతిమను తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. అర్చకులు సామూహిక కుంకుమార్చన జరిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. పూజల్లో ఆలయ ఈఓ ఎల్.రమాదేవి, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం హయగ్రీవ జయంతి, పవిత్రోత్సవ ముగింపు పూర్ణాహుతి నిర్వహించనున్నారు.



అమ్మవారికి కుంకుమార్చన జరుపుతున్న అర్చకులు

నిత్యాన్నదానానికి విరాళం

దేవస్థానం సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి భద్రాచలానికి చెందిన భక్తులు విరాళం అందించారు. రామాలయ సెంటర్‌కు చెందిన ఉడతా రమేష్, అనురాధ దంపతులు రూ.1,00,116లను ఆఈకు అందించగా, ఆమె దాతలకు రశీదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రవణ్‌కుమార్, ఆలయ సూపరింటెండెంట్ లింగాల సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు మహిళా న్యాయవాదుల రక్షాబంధన్

సూపర్‌బజార్(కొత్తగూడెం): రక్షాబంధన్ పండుగను పురస్కరించుకుని కొత్తగూడెం బార్ అసోసియేషన్ మహిళా న్యాయవాదులు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠలకు రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జనపరెడ్డి గోపీకృష్ణ, మహిళా న్యాయవాదులు ఆర్తీ మక్కడ్, నకరికంటి ఉమ, యాస మౌనిక, అరుణలత, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.



రాఖీలు కడుతున్న మహిళా న్యాయవాదులు

గురుకుల విద్యార్థుల ప్రతిభ

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : ఇటీవల తెలంగాణ జూడో అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అన్నపురెడ్డిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. బి.ప్రశాంత్ గోల్డ్‌మెడల్ సాధించి ఉత్తమ క్రీడాకారుడిగా నగదు అవార్డు పొందాడు. చల్లా రుషి, చల్లా రుత్విక్ సిల్వర్ మెడల్స్ సాధించారు. ప్రశాంత్ సెప్టెంబర్‌లో లక్నోలో జరిగే జాతీయస్థాయి పోటీలకు హాజరుకానున్నాడు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ప్రిన్సిపాల్ టి.బాలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కార్మికులకు రక్షణ కల్పించాలి



త్రైపాక్షిక సమావేశంలో రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

రక్షణ త్రైపాక్షిక సమావేశంలో డీఎంఎస్ ఉమేశ్ సావర్కర్

మణుగూరు టౌన్: కార్మికుల రక్షణ, ఆరోగ్య పరిరక్షణపై యాజమాన్యం దృష్టి సారించాలని డీఎంఎస్(మైనింగ్) ఎం.ఉమేశ్ సావర్కర్, డీఎంఎస్ (ఎలక్ట్రికల్) ఆనంద్‌వెల్ అన్నారు. శుక్రవారం ఇల్లెందు క్లబ్‌లో మణుగూరు ఏరియాస్థాయి 18వ రక్షణ త్రైపాక్షిక సమావేశం డైరెక్టర్ (పీఅండ్‌పీ) కొప్పుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత అధికారులందరూ రక్షణ ప్రతిజ్ఞ చేశారు. 17వ సమావేశంలో గుర్తించిన సమస్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంఎస్‌లు మాట్లాడుతూ ప్రతి గనిలో రక్షణపై ఉద్యోగులకు అవగాహన కల్పించాలన్నారు. రాత్రి షిఫ్ట్ నిర్వహించే ఉద్యోగుల కోసం లైటింగ్ వ్యవస్థను మెరుగుపర్చాలని చెప్పారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ (మైనింగ్) సనత్‌కుమార్ మాట్లాడారు. సింగరేణి డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు, జీఎం (సేఫ్టీ) కార్పొరేట్ చింతల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగులు తప్పనిసరిగా రక్షణ సూత్రాలు పాటించాలని అన్నారు. యంత్రాల పనిగంటలు పెంచి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని కోరారు. కేసీహెచ్‌పీలో దుమ్ముధూళి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. 2025–26 లక్ష్య సాధనకు సమష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏబీసీ రక్షణ సూత్రంపై అవగాహన కల్పించారు. ఏరియా జీఎం దుర్గం రాంచందర్ మాట్లాడుతూ ప్రమాద రహిత ఉత్పత్తికి పటిష్టంగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆ తర్వాత కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. ఈ సమావేశంలో కొత్తగూడెం ఏరియా జీఎం (సేఫ్టీ) కృష్ణ గోపాల తివారి, గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు వై.రాంగోపాల్, త్యాగరాజన్, కృష్ణంరాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జలవనరుల శాఖలో ఆరుగురికి పదోన్నతి

ఖమ్మం ఎస్‌ఈగా 'మంగళపూడి' నియామకం

ఖమ్మంఅర్బన్: రాష్ట్రవ్యాప్తంగా జల వనరుల శాఖలో పలువురు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల(ఈఈ)కు సూపరింటెండెంట్ ఇంజినీర్లు (ఎస్‌ఈ)గా పదోన్నతి లభించింది. రాష్ట్రవ్యాప్తంగా 46 మందికి పదోన్నతి దక్కగా, ఉమ్మడి జిల్లా నుంచి ఆరుగురు ఉన్నారు. ఈమేరకు ప్రభుత్వం నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈక్రమంలోనే పాలేరు ఈఈగా, ఖమ్మం ఇన్‌చార్జి ఎస్‌ఈగా పనిచేస్తున్న మంగళపూడి వెంకటేశ్వర్లు పదోన్నతి దక్కగా ఖమ్మం పూర్తిస్థాయి ఎస్‌ఈగా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే, ఖమ్మం డివిజన్ డిప్యూటీ చీఫ్‌గా, కల్లూరు ఈఈగా ఉన్న ఏవీఎస్.నరసింహారావును పదోన్నతిపై రామగుండం ఎస్‌ఈగా నియమించారు. ఇల్లెందు ఈఈ కేఎల్‌ఎం.శ్రీనివాసచార్యులును పెద్దపల్లి ఎస్‌ఈగా, మధిర ఎస్‌ఈ సీహెచ్.రామకృష్ణను మహబూబాబాద్ ఎస్‌ఈగా నియమిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. భద్రాచలంలో పనిచేస్తున్న రవికుమార్ గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ ఎస్‌ఈగా, సెలవులో ఉన్న హరి వెంకట్‌రాంప్రసాద్ వరంగల్ ఎస్‌ఈగా పదోన్నతి పొందారు. కాగా, ఖమ్మం ఎస్‌ఈగా పదోన్నతి పొందిన మంగళపూడి వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

25 పనిదినాలు.. 24 రోజులు ఫేక్ అటెండెన్స్



ఇది బూర్గంపాడు మండలంలోని సారపాక గ్రామపంచాయతీ కార్యాలయం. ఇక్కడ గ్రేడ్‌-2 కార్యదర్శి పనిచేస్తున్నారు. గత నెలలో 31 రోజులకు నాలుగు ఆదివారాలు, ఒక శనివారం, బోనాల పండుగకు కలిపి ఆరు సెలవులు వచ్చాయి. 25 పనిదినాలు ఉండగా, పంచాయతీ కార్యదర్శి 24 రోజులు ఫేక్ అటెండెన్స్ నమోదు చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. నెలమొత్తమ్మీద ఒక రోజు మాత్రం సక్రమంగా హాజరైనట్లు తేలింది. అది కూడా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశానికి జిల్లాలోని కార్యదర్శులందరూ హాజరైన సందర్భం. ఇక బూర్గంపాడు మండలంలోనే బూర్గంపాడు కార్యదర్శి(గ్రేడ్‌- 2), లక్ష్మీపురం కార్యదర్శి(గ్రేడ్‌-4) 24 రోజులు, తాళ్లగొమ్మూరు కార్యదర్శి(గ్రేడ్‌-3) 23 రోజులు తప్పుడు హాజరు నమోదు చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. భద్రాచలంలో పనిచేస్తున్న గ్రేడ్‌-1 కార్యదర్శి కూడా 24 రోజులు ఫేక్ అటెండెన్స్ నమోదు చేసుకున్నారు. టేకులపల్లి మండలం తడికలపూడి కార్యదర్శి (గ్రేడ్‌-3) 21 రోజులు తప్పుడు హాజరు నమోదు చేసుకున్నట్లు అధికారులు తేల్చారు.

- ఆరు పంచాయతీల్లో 20 రోజులకు పైగా తప్పుడు హాజరు
- గత నెల అక్రమ హాజర్ల ఆధారంగా కార్యదర్శులపై వేటు?
- కఠిన చర్యలకు సిద్ధమవుతున్న ఉన్నతాధికారులు
- జిల్లాలో 42 గ్రామపంచాయతీల్లో ఫేక్ అటెండెన్స్

ఫేక్ అటెండెన్స్	కార్యదర్శుల సంఖ్య
20 రోజులకుపైగా	6
16 నుంచి 20 రోజులు	10
10 నుంచి 15 రోజులు	26

చుంచుపల్లి: గ్రామ పంచాయతీల్లో కీలకంగా వ్యవహరించే కార్యదర్శులు కొందరు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తప్పుడు హాజరు నమోదు చేసుకున్నారు. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. జిల్లాలో తప్పుడు హాజరు నమోదు చేసుకున్న 42 మంది పంచాయతీ కార్యదర్శులను అధికారులు గుర్తించి నోటీసులను జారీ చేసిన విషయం తెలిసిందే. వీరిలో కొందరిపై వేటు పడనుందనే చర్చ జోరుగా జరుగుతోంది. గత నెలలో కొందరు అత్యధికంగా 21, 23, 24 రోజులపాటు తప్పుడు హాజరు నమోదు చేసినట్లు తేలింది. 20 రోజులకు పైగా తప్పుడు హాజరును నమోదు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనే యోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. దీన్నే ప్రామాణికంగా తీసుకుని కొన్ని జిల్లాల్లో కార్యదర్శులను సస్పెండ్ చేశారు. కాగా పది రోజుల కంటే ఎక్కువ తప్పుడు హాజరు వేసుకున్న 42 మందిపై అధికారులు చర్యలకు సిద్ధంకాగా, పది రోజులకంటే తక్కువ తప్పుడు హాజరు నమోదు చేసుకున్న వారు మరికొందరు ఉన్నట్లు తెలుస్తోంది.

నోటీసులకు వివరణ వచ్చాక..

ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేసిన 42 మంది కార్యదర్శుల నుంచి వివరణ కోసం జిల్లా అధికారులు ఎదురుచూస్తున్నారు. వీరితో పాటు బాధ్యులను చేస్తూ 17 మంది ఎంపీఓలకు సైతం నోటీసులు ఇచ్చారు. నెలలో అత్యధికంగా ఫేక్ అటెండెన్స్ వేసిన కార్యదర్శులు, వారి పనితీరును పరిగణనలోకి తీసుకుని సస్పెన్షన్ చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఇతర జిల్లాలో మాదిరిగానే ఇక్కడ కూడా తప్పుడు హాజరు నమోదు చేసిన కార్యదర్శులపై వేటు తప్పదనే వాదనలు వినిపిస్తోంది. ప్రధానంగా జూలైలో హాజరును పరిగణనలోకి తీసుకుని అత్యధిక రోజులు ఫేక్ అటెండెన్స్ నమోదు చేసిన వారిపై చర్యలు ఉంటాయని తెలుస్తోంది.

ఆ ఆరుగురిపై కఠిన చర్యలు?

ప్రధానంగా నెలలో 20 రోజులకుపైగా ఫేక్ హాజరును నమోదు చేసినట్లు గుర్తించిన సారపాక, భద్రాచలం, బూర్గంపాడు, లక్ష్మీపురం, తాళ్లగొమ్మూరు, తడికలపూడి వంటి మేజర్ పంచాయతీల కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిసింది. ఇక నుంచి విధులకు హాజరవ్వకుండా తప్పుడు అటెండెన్స్ నమోదు చేసే పంచాయతీ కార్యదర్శులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పంచాయతీరాజ్ శాఖ కలెక్టర్లకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. భారతీయ న్యాయ సంహిత, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫోర్జరీ, మోసపూరిత, సైబర్ మోసం చట్టం తదితర నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేయాలని సూచించింది. కార్యదర్శులపై పర్యవేక్షక బాధ్యతలు నిర్వర్తించే మండల, డివిజనల్, జిల్లా పంచాయతీ అధికారులు మోసాలను గుర్తించడంలో విఫలమైనా, నిర్లక్ష్యం వహించినా వారిపైనా క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ డైరెక్టర్ సృజన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం జిల్లాలోని ఏదులాపురం మున్సిపాలిటీతో పాటు రఘునాథపాలెం, వైరా, బోనకల్ మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దమ్మపేట, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాల్లోని పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొననున్నారు.

సేవకులు ముందు వరుసలో ఉండాలి


నూతనంగా ఎన్నికైన కమిటీ

చర్ల: క్రీస్తు పరిచర్యను కొనసాగించేందుకు సేవకులు ముందు వరుసలో ఉండాలని అసోసియేషన్ ఆఫ్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ (ఏఐసీసీ) రాష్ట్ర అధ్యక్షుడు రెవరెండ్ ఏనోశ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం చర్ల మండలంలోని సీ-కత్తిగూడెంలో టీజీఎం ప్రార్థనా మందిరంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం నిర్వహించగా.. ఆయన పాల్గొని మాట్లాడారు. ఒడిదుడుకులను అధిగమించి ముందుకు సాగితేనే సేవా పరిచర్య సాగించడం సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం చర్ల మండల ఏఐసీసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బండివిజయ్‌ఆనంద్, ఐ.ఇమ్మానియేల్‌ను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షులుగా వై.లాజర్,కార్యదర్శిగా ఇప్పా ప్రభుదాస్, సహాయ కార్యదర్శిగా కె.బర్నబస్, ఈసీ మెంబర్లుగా బాలరాజు, పాల్‌రాజు, సంసోన్, యేసు దాసును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డి.డేవిడ్‌రాజు, డి.బాలరాజు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

బూర్గంపాడు: బూర్గంపాడుకు సమీపంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులలోని గుడుంబా స్థావరాలపై శుక్రవారం రెండు రాష్ట్రాల ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. కిన్నెరసాని నదిఒడ్డున గుడుంబా తయారీ స్థావరాలతో స్థానిక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతుల ఫిర్యాదు మేరకు రెండు రాష్ట్రాల ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి, 30 డ్రమ్ముల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ రహీమున్నీసా పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసు నమోదు

ఇల్లెందు: మద్యానికి డబ్బులు లేవని చెప్పడంతో భార్యను హత్యచేసేందుకు యత్నించిన వ్యక్తిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన నాగరాజు.. తెల్లవారుజామున 3 గంటల సమయంలో భార్య ప్రియాంకను నిద్రలేపి, మద్యానికి డబ్బులు అడిగాడు. ఆమె లేవని చెప్పడంతో కత్తితో తలపై దాడి చేశాడు. మెడ పట్టుకుని చంపేందుకు యత్నించగా.. ఆమె తప్పించుకుని సోదరి ఇంటికి వెళ్లి.. ఆస్పత్రిలో వైద్యం పొందింది. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నాగరాజుపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

ఖర్చు తక్కువ.. పోషకాలు ఎక్కువ


భూసారం పెంచేందుకు ఆయిల్‌పామ్ తోటలో సాగు చేస్తున్న జనుము

- సేంద్రియ ఎరువులతో తగ్గనున్న పెట్టుబడి ఖర్చులు
- దేశ సరాసరి కంటే జిల్లాలో రసాయన ఎరువుల వినియోగం అధికం

సూపర్‌బజార్(కొత్తగూడెం): పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగంతో పెట్టుబడి పెరుగుతోంది. మరోవైపు మొక్కలకు పోషకాలు అందించాలంటే ఎరువుల వాడకం తప్పనిసరిగా మారింది. రాష్ట్రంలో పెద్దదిగా ఉన్న జిల్లాలో దేశ సరాసరి ఎరువుల వినియోగానికి మించి ఎరువులను వినియోగిస్తున్నారు. అధికారిక గణాంకాల ప్రకారం ఎకరానికి ఎరువుల ఖర్చు రూ.6,671 అవుతోంది. ఎకరానికి 104 కేజీల యూరియా, 24 కేజీల డీఏపీ, 14 కేజీల ఎంఓపీ, 136 కేజీల కాంప్లెక్స్, 10 కేజీల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వినియోగిస్తున్నారు. అన్ని రకాల ఎరువులు కలిపి ఎకరానికి 287 కేజీలు వాడుతున్నారు. జిల్లాలో 2024లో సాగు విస్తీర్ణం 5,92,264 ఎకరాలు కాగా 1,70,153 మెట్రిక్ టన్నులను రైతులు వినియోగించారు. దీని విలువ రూ.395.12 కోట్లు. 2025లో పంటల సాగు విస్తీర్ణం 6,03,124 ఎకరాలు కాగా 1,69,037 మెట్రిక్ టన్నుల ఎరువులను వాడారు. దీని విలువ రూ.396.13 కోట్లు కావడం గమనార్హం.

రసాయన ఎరువులతో అన్ని పోషకాలు అందవు..

అన్ని రకాల పోషకాలు పంటలకు అందాలంటే


అన్నపురెడ్డిపల్లి మండలంలో వరిపై నానో యూరియా పిచికారీ

రసాయనిక ఎరువుల వల్ల సాధ్యం కాదని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. సేంద్రియ ఎరువులను వినియోగిస్తే నత్రజని, భాస్వరం, పొటాషియం తదితర పోషకాలు పంట మొక్కలకు లభిస్తాయని చెబుతున్నారు. నేల సాంద్రతకు భూసార యాజమాన్య పద్ధతులు అవలంబించాలని పేర్కొంటున్నారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, పచ్చిరొట్ట ఎరువులు, నవధాన్యాలు, చెరువు మట్టి, పశువుల, గొర్రెల మందలు పెట్టడం వంటి చర్యలు చేపట్టాలి. పంట మార్పిడి, అంతర పంటలసాగు పాటించాలి.

సేంద్రియ ఎరువులతో ప్రయోజనాలు

- పచ్చిరొట్ట పైర్ల సాగువల్ల నేలలో సేంద్రియ పదార్థం, సేంద్రియ కర్బనం వృద్ధి చెంది పోషక లభ్యత పెరుగుతుంది.
- పంటల సాగులో అంతర పంటలుగా అపరాల పంటలైన పెసర, మినుము, కంది, అలసంద చేర్చడం ద్వారా నేలలో నత్రజని లభ్యత పెరుగుతుంది. వర్మీ కంపోస్టు, సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా పంటలకు కావాల్సిన పోషకాలు లభిస్తాయి
- భాస్వరం కరిగించే బాక్టీరియాను సేంద్రియ ఎరువులతో కలిపి పంటచేలల్లో వినియోగిస్తే నేలలో స్థిరీకరించిన భాస్వరం పంటలకు ఊతంగా నిలుస్తుంది
- కాంప్లెక్స్ ఎరువులను దుక్కిలో మాత్రమే వాడాలి. పైపాటుగా కాంప్లెక్స్ ఎరువుల వాడకం సాగు ఖర్చు పెరగడానికి ఉపయోగం తప్ప పంటలకు లభించదు
- యూరియా, పొటాష్ ఎరువులను పంటకాలంలో మూడు పర్యాయాలుగా విభజించి వినియోగిస్తే ఎరువుల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.
- వరిలో అజోల్లాను వదలితే నత్రజని పంటకు అందుతుంది.
- పైపాటుగా యూరియాకు బదులుగా నానో యూరియా పిచికారీ చేయటం కూడా ఎరువుల్లో పోషక లభ్యత పెరుగుతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.
- పైపాటుగా ఎరువులు వేసినపుడు పాకటింగ్ పద్ధతిలో వేయాలి
- మొక్కకు నాలుగు అంగుళాల దూరంలో అంతేలోతు గుంట తీసి ఎరువు వేసి కప్పివేయాలి. ఈపద్ధతి కారణంగా ఎరువు వృథా కాదు. ఈ పద్ధతుల కారణంగా పంటపెట్టుబడి ఖర్చు తగ్గటంతో పాటు ఎరువుల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.

నాణ్యమైన దిగుబడి..



సాగు ఖర్చు తగ్గి, నేల సాంద్రత పెరిగి అధిక దిగుబడులు సాధించాలంటే సేంద్రియ ఎరువులను రైతులు తప్పకుండా ఉపయోగించాలి. దీని వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు నాణ్యమైన పంట దిగుబడులు వచ్చి రైతులు కూడా ఆర్థికంగా ఎదుగుతారు. ఈవిషయాలపై రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– పి రవికుమార్, అశ్వారావుపేట ఏడీఏ

మిగులు భూమి ఎంత?


ఖమ్మంలోని ఎన్నెస్పీ క్యాంప్ ఆవరణ

- జలవనరుల శాఖ స్థలాలపై ఆరా
- సబ్ డివిజన్ల వారీగా లెక్కలు తీస్తున్న యంత్రాంగం
- ఖమ్మం ఎన్నెస్పీ క్యాంపులో మిగిలింది 16 ఎకరాలే?

ఖమ్మంఅర్బన్: రాష్ట్రవ్యాప్తంగా జలవనరుల శాఖ పరిధిలోని భూముల గుర్తింపునకు కసరత్తు మొదలైంది. ఆయా భూముల లెక్కలు తేల్చి రక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల ఆదేశించారు. దీంతో జిల్లాలోనూ అధికారులు మిగులు భూముల లెక్కలపై ఆరా తీస్తున్నారు. జిల్లావ్యాప్తంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్నెస్పీ) పరిధి కాల్వల నిర్మాణ సమయాన రైతుల నుంచి భారీగా భూములు సేకరించారు. జిల్లాలోని 17 మండలాల పరిధిలో భూములు సేకరించగా.. కాల్వల తవ్వకం, క్యాంప్‌లు, క్వార్టర్లు, ఇతర నిర్మాణాలకు పోగా మిగిలిన భూములు ఎక్కడెక్కడ, ఎంత మేర ఉన్నాయని సబ్ డివిజన్ల వారీగా నివేదిక తయారు చేస్తున్నారు.

239 కి.మీ. మేర కాల్వలు

జిల్లాలో సాగర్ ప్రధాన కాల్వ, బ్రాంచ్ కాలువలు కలిపి 239 కి.మీ. మేర విస్తరించి ఉన్నాయి. వీటితో పాటు మేజర్లు, మైనర్లకు సైతం అప్పట్లో రైతుల నుంచి భూములు సేకరించారు. అయితే, అవసరానికి మించి చాలాచోట్ల ఎక్కువ వైశాల్యం గల భూములు సేకరించినట్లు అంచనా. డీప్ కట్ ప్రాంతాల్లో మట్టి పోసేందుకు, క్యాంప్‌లు, యంత్రాల నిల్వ కోసం ఇలా సేకరించినట్లుసమాచారం. బోనకల్ బ్రాంచ్, మధిర బ్రాంచ్, 16-17 బ్రాంచ్ కాల్వల పరిధిలో భారీగా భూసేకరణ జరిగినట్లు తెలిసింది.

క్యాంపుల నిర్మాణం

విధినిర్వహణకు వచ్చే ఎన్నెస్పీ ఉద్యోగుల కోసం ఖమ్మం, వైరా, నేలకొండపల్లి, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, ఏనుకూరు, తిమ్మారావుపేట, బసవాపురం తదితర ప్రాంతాల్లో క్యాంప్‌లు నిర్మించారు. అలాగే, ఉద్యోగులు, సిబ్బంది ఉండేలా క్వార్టర్ల నిర్మాణం సైతం జరిగింది. ఆతర్వాత మిగులు భూముల్లో కొన్నేళ్ల నుంచి ప్రభుత్వ కార్యాలయాలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, మార్కెట్ యార్డులకు కేటాయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆక్రమణలు సైతం జరగగా.. ప్రభుత్వమే 59 జీఓ ద్వారా క్రమబద్ధీకరించడంతో ఎన్నెస్పీ భూములు కుచించుకుపోయాయి.

పేరుకే క్యాంప్..

ఖమ్మం నగర నడిబొడ్డున ఉన్న ఎన్నెస్పీ క్యాంపులో మొత్తం 96 ఎకరాల భూమి జలవనరుల శాఖ పరిధిలో ఉంది. కానీ ఇది రికార్డుల్లో మాత్రమే కనిపిస్తోంది. ఈ భూమిలో 80 ఎకరాలకు పైగా వివిధ ప్రభుత్వ శాఖలు, రాజకీయ పార్టీ కార్యాలయాలు, ప్రార్థనా మందిరాలకు కేటాయించారు. ఇదే స్థలంలో ఆర్‌టీసీ, ఆర్‌టీఓ, ఎల్‌ఐసీ, డీపీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఇక పట్టాదారులు కొందరు అప్పటి ఎన్నెస్పీ అధికారుల ద్వారా తమ పట్టా భూములు మిగులుగా ఉన్నాయని కొంతమేర తీసుకున్నట్లు సమాచారం. అన్నీ పోగా క్యాంప్‌లో ప్రస్తుతం 16 ఎకరాలే జలవనరుల శాఖ పేరున మిగిలి ఉండొచ్చని అంచనా.

కేటాయింపులు, ఆక్రమణలు

ఎన్నెస్పీ ప్రధాన కాల్వపైనే పాలేరు నుండి ఏన్కూరు వరకు ఖమ్మం చుట్టుపక్కల సుమారు 368ఎకరాల భూమిని రెవెన్యూ శాఖకు అప్పగించారు. ఇందులో దానవాయిగూడెం కాలనీ, మద్దులపల్లి మార్కెట్ ఏర్పడ్డాయి. ఇక మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణంతో భూములు, ఇళ్లు కోల్పోతున్న వారికి కొంతమేర స్థలాలు ఇచ్చేందుకు గుర్తించారు. ఖమ్మం నడిబొడ్డున మేజర్ కాల్వ ఐదున్నర కి.మీ. పొడవుతో టేకులపల్లి వంతెన నుంచి చైతన్యనగర్, వరదయ్యనగర్, మధురానగర్ కాలనీ ధంసలాపురం వరకు ఉండేది. కానీ ఇప్పుడు కేవలం కి.మీ. నిడివి ద్వారా మాత్రమే లకారం చెరువులోకి నీరు చేరేందుకు ఉపయోగపడుతోంది. మిగతా భాగమంతా ఆక్రమణలకు గురికాగా.. ఇంకొంత క్రమబద్ధీకరణతో ఇతరుల పరమైంది. అలాగే, కాల్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి ప్లాట్లుగా మార్చేసిన ఉదంతాలు కూడా వెలుగు చూశాయి. దీంతో ఇప్పుడు కాల్వల గుర్తింపు కష్టంగా మారింది చెబుతున్నారు.

భవిష్యత్ అవసరాల కోసం...

ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల నిర్మించేందుకు అవసరమైన భూమి కావాలన్నప్పుడు వెతకాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఈ నేపథ్యాన మిగులు భూములపై సమగ్ర సర్వే చేసి నివేదిక సమర్పించాలని ఆదేశాలు అందాయి. దీంతో జిల్లాలోని జలవనరుల శాఖ మిగులు భూములను పూర్తిస్థాయిలో గుర్తించడంలో నిమగ్నమయ్యారు. ఇదేసమయాన ఆక్రమణలు, కేటాయింపులు, ప్రభుత్వ వినియోగం తదితర వివరాలను కూడా నివేదికలో పొందుపర్చనున్నట్లు తెలిసింది.

రెండో రోజు రెండు నాటికలు

పాశ్చాత్య సంస్కృతిని ప్రతిబింబించిన 'ఖరీదైన జైళ్లు'


'ఖరీదైన జైళ్లు' నాటికలోని ఓ సన్నివేశం


కళాకారులకు పారితోషికం అందజేస్తున్న నాయకులు, నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీల్లో కళాకారులు ప్రదర్శిస్తున్న నాటికలు ప్రేక్షకులను ఆలోచింపచేస్తున్నాయి. నెలనెలా వెన్నెల 8వ వార్షికోత్సవం సందర్భంగా ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న పోటీలు శుక్రవారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా కరీంనగర్‌కు చెందిన చైతన్య కళా భారతి బాధ్యులు 'ఖరీదైన జైళ్లు' నాటికను ప్రదర్శించారు. ఆధునిక సమాజంలో గ్రామీణ వాతావరణం, నగరాల్లో బ్రతుకుతున్న ప్రజల జీవన విధానాలు, ప్రేమానుబంధాల మధ్య తేడాను ఈ తేడా ద్వారా కళ్లకు కట్టినట్లు చూపారు. ఓ అపార్టుమెంట్‌లో ఉంటున్న కుటుంబంలో కొడుకు అమెరికాలో, కూతురు ముంబైలో ఉండగా తండ్రి మరణిస్తాడు. ఈ విషయం తెలిపినా పిల్లలు పనుల కారణంగా రాకపోవడంతో వాచ్‌మెన్ తలకొరివి పెట్టగా కుమారుడు, కుమార్తె ఆన్‌లైన్‌లో చూస్తూ నివాళులర్పించడం ఇతివృత్తంగా ఈ నాటిక సాగింది. అనంతరం విజయవాడకు చెందిన మైత్రి కళానిలయం వారు 'బ్రహ్మస్వరూపం' నాటికను ప్రదర్శించారు. స్నిగ్ధ నాటకీకరించిన ఈ నాటికకు టీవీ.పురుషోత్తం దర్శకత్వ వహించారు. ఆహ్లాదకరంగా సాగే జీవితంలో ఊహించని కష్టం చోటు ఎదురైతే జరిగే పరిణామాల ఇతివృత్తంగా ఈ నాటిక సాగింది. కాగా, రెండో రోజు పోటీలను చెరుకూరి వనశ్రీ, కాటంనేని వీరభద్రరావు, రమేష్, సంపత్, తిరుమలాచారి, వేల్పుల విజేత, అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్, డాక్టర్ నాగబత్తిని రవి, జగన్మోహన్ రావు, సదానందం, లక్ష్మీనారాయణ ప్రారంభించారు. అనంతరం ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్, నాయకుడు తుమ్మల యుగేందర్ తదితరులు హాజరై ప్రదర్శకులకు పోత్సాహకాలు అందించారు. కాగా, నాటిక పోటీలకు శనివారం సినీ నటుడు, రచయిత తనికెళ్ల భరణి హాజరుకానున్నారని నిర్వాహకులు తెలిపారు.

డబ్బు తక్కువ ఇచ్చారని హిజ్రాల దూషణ

నేలకొండపల్లి: అడిగినంత డబ్బు ఇవ్వండి.. లేకపోతే మేం మా శాపానికి బతుకులు ఆగమవుతాయంటూ కొందరు హిజ్రాలు బలవంతంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. నేలకొండపల్లిలో శ్రావణ శుక్రవారం సందర్భంగా పలువురు వ్రతం చేసుకుంటుండగా ఇద్దరు హిజ్రాలు చేరుకున్నారు. ఇందులో ఒకరు ఇంటింటికీ వెళ్లి అడిగినంత డబ్బులు ఇవ్వండి, లేకపోతే మీ కుటుంబం ఇబ్బందుల పాలవుతుందని బెదిరించారు. ఎందుకొచ్చిన గొడవ అనుకుని కొందరు డబ్బులు ఇవ్వగా మరికొందరు తక్కువ ఇవ్వబోగా శాపనార్థాలు పెట్టారు. నేలకొండపల్లి, బైరవునిపల్లి,ఆరెగూడెం, సింగారెడ్డిపాలెం తదితర గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొనగా విసిగిపోయిన స్థానికులు ఆగ్రహంతో దాడికి యత్నించగా హిజ్రాలు ఇద్దరు వాహనంపై పారిపోయారు. కాగా, టెంట్ కనిపిస్తే చాలు శుభ, అశుభ కార్యమేదైనా డబ్బులు డిమాండ్ చేస్తూ ఇబ్బంది పెడుతున్న హిజ్రాల తీరుపై పోలీసులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

కత్తి దాడిలో తీవ్ర గాయాలు

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి సాయిగణేష్‌నగర్‌కు చెందిన గుడిపెల్లి సుదర్శన్‌పై అదే కాలనీకి చెందిన మెడికంటి రాజవర్ధన్‌రెడ్డి కత్తితో దాడి చేయగా గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు... సుదర్శన్ గురువారం రాత్రి స్థానిక సూపర్ మార్కెట్‌కు వెళ్లగా అక్కడ ఓ వ్యక్తిని రాజవర్ధన్‌రెడ్డి కొడుతుండడంతో అడ్డుకోబోయాడు. దీంతో సుదర్శన్‌పై రాజవర్ధన్‌రెడ్డి కత్తితో దాడి చేయగా తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై క్షతగాత్రుని భార్య ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేశామని సీఐ ముష్క రాజు తెలిపారు. కాగా, సుదర్శన్‌ను మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి పరామర్శించారు.

ఆటోడ్రైవర్ అదృశ్యంపై కేసు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం వైఎస్సార్ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ జానీ కానరాకుండా పోవడంపై కేసు నమోదైంది. కొద్దిరోజుల క్రితం బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు గాలించినా ఫలితం కానరాలేదు. దీంతో జానీ కుటుంబ సభ్యులు శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఖమ్మం అర్బన్ సీఐ భాను ప్రకాష్ తెలిపారు.

వైరల్ ఫీవర్‌తో రైతు మృతి

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం ఈర్లపూడికి చెందిన రైతు పున్నపోల వెంకటేశ్వర్లు(49) వైరల్ ఫీవర్‌తో చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఆయన నాలు గు రోజుల క్రితం జ్వరం బారిన పడగా ఖమ్మంలో చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స చేయిస్తుండగానే వెంకటేశ్వర్లు మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

డెంగీ లక్షణాలతో మహిళ ..

కొణిజర్ల: డెంగీ లక్షణాలతో బాధపడుతున్న ఓ మహిళ మండలంలోని తనికెళ్లలో శుక్రవారం మృతి చెందింది. గ్రామానికి చెందిన కూచుపూడి హరిత(35) జ్వరం బారి న పడగా ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అయి తే, ప్లేట్‌లెట్ల సంఖ్య క్షీణించడంతో హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. కాగా, హరిత డెంగీతోనే మృతి చెందిందని ఆమె కుటుంబీకులు చెప్పగా.. పెద్దగోపతి పీహెచ్‌సీ వైద్యాధికారి రాధాకృష్ణ మాత్రం డెంగీ పరీక్షలో నెగిటివ్‌గా వచ్చిందని తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య లోపంతో దోమల పెరిగి జ్వరాలు వ్యాపిస్తున్నందున అధికారులు స్పందించాలని స్థానికులు కోరారు.

ఆర్టీసీ బస్సులో ఛత్తీస్‌గఢ్ వాసి..

వైరా: అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స చేయించుకుని వస్తున్న ఛత్తీస్‌గఢ్‌వాసి ఆర్టీసీ బస్సులోనే మృతిచెందాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా గుడారా గ్రామానికి చెందిన దేవ శిపా అనారోగ్యంతో బాధపడుతుండగా రెండు రోజుల క్రితం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స అనంతరం శుక్రవారం ఆర్టీసీ బస్సులో భద్రాచలం బయలుదేరగా వైరా వద్దకు వచ్చేసరికి మృతి చెందాడు.

దీంతో డ్రైవర్ స్టేషన్ మాస్టర్ సాయంతో వైరా పోలీసులకు సమాచారం ఇవ్వగా ట్రెయినీ ఎస్ఐ పవన్ పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

లారీ కిరాయి పెంచక మూడేళ్లు..


కిష్టారం ఓసీ లోడింగ్ పాయింట్ వద్ద లారీలు

- ఏజెంట్ల ఇష్టారాజ్యంతో యజమానులకు అన్యాయం
- భూనిర్వాసితులకు దక్కని ప్రాధాన్యత

సత్తుపల్లి: మూలిగే నక్కపై తాటికాయ పడిందన్న చందంగా సత్తుపల్లిలోని బొగ్గు లారీల యజమానుల పరిస్థితి తయారైంది. లారీ నిర్వహణ ఖర్చులు, పన్నులు, బీమా, పెరిగిన డీజిల్ ధరలు, డ్రైవర్లు, క్లీనర్ల జీత భత్యాలు పెరిగిపోతుంటే.. వారికి ఇచ్చే కిరాయి మాత్రం పెరగడం లేదు. మూడేళ్ల క్రితం హైదరనాబాద్‌కు బొగ్గు రవాణా చేస్తే టన్నుకు రూ.1,400 చెల్లించేవారు. ఇప్పుడు అదే అద్దె చెల్లిస్తుండడం గమనార్హం. ఒక్కో లారీకి ఏజెంట్ కమీషన్ రూ.3వేలు దండుకుంటున్నా.. కిరాయి పెంచకపోవడంపై లారీల యజమానుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. అయినా లారీలను ఏజెంట్లు చెప్పినట్లుగా అద్దెకు తిప్పాల్సి వస్తోంది. అయితే, ఈ అంశంపై లారీ యజమానుల యూనియన్ దృష్టి సారించకపోవటం మరింత ఆందోళన కలిగిస్తుందని వాపోతున్నారు. ఉద్యమించి సాధించుకున్న బొగ్గు లోడింగ్ దళారుల పాలవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమలు కాని తీర్మానం

ఏడాదిన్నర క్రితం ఎవరికైనా ఐదు లారీల కంటే ఎక్కువ ఉంటే వాటిని యూనియన్ పరిధిలో సీరియల్ వేసేది లేదని జనరల్ బాడీ సమావేశంలో తీర్మానించారు. అయినా అమలుకు నోచుకోవడం లేదు. ఐదు లారీల కంటే ఎక్కువగా 20 మంది కలిగి ఉండగా.. వీరి లాభం కోసం ఒక్కో లారీ ఉన్న యజమానులను ఇబ్బందులు పెడుతున్నారని చెబుతున్నారు. యూనియన్‌లో కూడా వీరి పెత్తనమే ఉండటంతో చర్చించటానికి సైతం ముందుకు రావటం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

భూ నిర్వాసితుల సంగతేమిటి?

సత్తుపల్లి మండలంలోని కిష్టారం, కొమ్మేపల్లి, జగన్నాథపురం, చెరకుపల్లి, రేజర్ల గ్రామాల రైతులు వందల ఎకరాల భూమిని సింగరేణి గనుల కోసం అప్పగించారు. ఆ సమయాన భూనిర్వాసితులకు బొగ్గు రవాణాలో ప్రాధాన్యత కల్పిస్తామని సింగరేణి అధికారులు ఇచ్చిన హామీ మాత్రం నెరవేరడం లేదు. ఏడాది క్రితం భూ నిర్వాసితులు తమ న్యాయమైన వాటా కింద లారీలకు లోడింగ్ ఇవ్వాలని కోర్టును ఆశ్రయిస్తే.. లారీ యూనియన్ బాధ్యులు చర్చిద్దామని నచ్చజెప్పి ఇప్పటి వరకు పట్టించుకోలేదు. సుమారు వందకు పైగా లారీలు భూనిర్వాసితులకు ఉండగా.. లోకల్, నాన్‌లోకల్ లోడింగ్ కారణాలతో లోడింగ్ దక్క ఫైనాన్స్ కిస్తీలు చెల్లించలేక రోడ్డున పడుతున్నారు.

నాన్‌లోకల్ రోజుకు 20

లారీల యజమానుల ఆందోళనలకు మద్దతు తెలుపుతూ సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సింగరేణి అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో లారీలకు రోజూ 1,500 టన్నుల బొగ్గు లోడింగ్ ఇచ్చేందుకు అంగీకరించారు. దీంతో రోజుకు 50 లారీలకు లోడింగ్ దక్కుతుండగా... నాన్‌లోకల్ లారీలకైతే కమీషన్ ఎక్కువగా వస్తుందని 20 లారీలు ఇస్తుండడంతో స్థానిక లారీ యజమానులకు మళ్లీ సీరియల్ బాధలు తప్పడం లేదు. లారీ యూనియన్ బాధ్యులు దీనిపై దృష్టి సారించకుండా లోడింగ్ లేవంటూ ఆందోళనలు చేయటం.. తీరా లోడింగ్ వచ్చిన తర్వాత నాన్ లోకల్ లారీలకు ఏజెంట్లు కట్టబెడుతున్న తీరుపై నోరు మెదపకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇకపోతే కోయగూడెం ఓసీలో నాన్‌లోకల్ కింద బయట లారీలకు కిరాయి ఇవ్వకుండా స్థానిక లారీలకే నాన్‌లోకల్ కింద తక్కువ కిరాయితో పంపిస్తున్నట్లు సమాచారం.

గుండెపోటుతో మృతి


శంకర్ (ఫైల్)

మణుగూరుటౌన్: సీపీఐ రాష్ట్ర నాయకుడు బొల్లోజు అయోధ్యచారి మృతిని జీర్ణించుకోలేక సాంబాయిగూడెంనకు చెందిన తన అభిమాని గురువారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని సాంబాయి గూడెం గ్రామానికి చెందిన రాచకొండ శంకర్ అలియాస్ చక్రయ (43) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అయోధ్య అంటే ఎనలేని అభిమానం. అయోధ్య అంతిమయాత్రలో పాల్గొన్నాడు. కార్యక్రమం అనంతరం ఇంటికి వెళ్లగా గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బైక్ దొంగ అరెస్ట్


నిందితుడు, బైక్‌లను చూపుతున్న పోలీసులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల చోరీలకు గురైన ఐదు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని, చోరీచేసిన నిందితుడైన బూర్గంపాడు మండలం సారపాక జీపీ గాంధీనగర్‌కు చెందిన గుగులోత్ శ్రీనును శుక్రవారం అరెస్ట్ చేశారు. భద్రాచలంటౌన్ సీఐనాగరాజు కథనం ప్రకారం.. భద్రాచలం పట్టణంలో వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా.. బైక్‌ల చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడిపై గతంలో నాలుగు కేసులు ఉన్నాయని, రిమాండ్‌కు తరలించామని సీఐ నాగరాజు వివరించారు.

పాత సంతకాలతో నోటరీలు?

ఖమ్మంక్రైం: కార్పొరేషన్ కార్యాలయం సమీపాన ఓ మహిళ నిర్వహిస్తున్న జిరాక్స్, ఆన్‌లైన్ సెంటర్‌లో శుక్రవారం రాత్రి టూటౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ చేపట్టారు. నోటరీ కోసం వచ్చే వారిని విచారించకుండానే పాత సంతకాలతో కూడిన పత్రాలు విక్రయిస్తుందనే ఫిర్యాదులు అందాయని సమాచారం. దీంతో తనిఖీ చేపట్టి 36 నోటరీలను స్వాధీనం చేసుకున్నామని సీఐ బాలకృష్ణ తెలిపారు.

క్లుప్తంగా...

మహిళా సంక్షేమంలో రాజీ లేదు

- అక్కాచెల్లెళ్లందరికీ ప్రభుత్వం అండగా ఉంటుంది
- సీఎం రేవంత్‌రెడ్డి రాఖీ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: శనివారం రాఖీ పండుగ పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన ఆకాంక్షించారు. మహిళల రక్షణ, భద్రత విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోందని తెలిపారు. వారి అభివృద్ధి, సంక్షేమంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అక్కాచెల్లెళ్లందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, అందరి దీవెనలతో విజయవంతంగా ప్రజాపాలన సాగిస్తుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రాభివృద్ధిలో మహిళలందరూ భాగస్వాములయ్యేతంవరకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఆడబిడ్డల ఆర్థిక సాధికారతే అసలైన రక్షాబంధన్ అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ కూడా రాఖీ శుభాకాంక్షలు తెలియజేశారు.

అక్కచెల్లెమ్మలకు వైఎస్ జగన్ రాఖీ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: రాఖీ పండుగ సందర్భంగా రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలందరికీ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆత్మీయతలు, అనురాగాల పండుగ రక్షాబంధనం అని.. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా, రక్షణపరంగా మహిళలకు ఎల్లప్పుడూ మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలందరికీ దేవుడి ఆశీస్సులు ఎల్లకాలం లభించాలని కోరుకుంటున్నానని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

టీడీపీ తొండాట!

వైఎస్సార్‌సీపీకి పట్టు ఉన్న పల్లెల్లో పోలింగ్ బూత్‌ల మార్పిడి

పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక వేళ కుట్రలు, కుతంత్రాలు

- నల్లపురెడ్డిపల్లి, ఎర్రబల్లె కొత్తపల్లె, నల్లగొండువారిపల్లెలో మాయాజాలం
- ఓటు వేసేందుకు ఎక్కువ మంది వెళ్లకూడదని ఎత్తుగడ
- అల్లర్లు సృష్టించి పోలింగ్ శాతం పెరగకుండా అడ్డుకునే పన్నాగం
- గతంలో ఏ గ్రామం వారికి ఆ గ్రామంలోనే ఓటు
- ఇప్పుడు బూత్‌లను మార్చిన ఎన్నికల కమిషన్
- ఈ కారణంగా దాదాపు 4 కిలోమీటర్లు వెళ్లి ఓటేయాల్సిన పరిస్థితి
- టీడీపీ నేతల కుట్ర రాజకీయానికి పూర్తిగా సహకరిస్తున్న అధికార గణం
- టీడీపీ ప్రభావం నుంచి ఎన్నికల సంఘం బయటకు రావాలి : ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కొద్ది రోజులుగా వరుస దాడులు



సాక్షి ప్రతినిధి, కడప: 'ఏం చేస్తారో చేయండి.. అక్కడ మనం బలం చాటుకోవాలి.. ఎప్పటికప్పుడు మీకు ఏ సహాయం కావాలో చెబితే వెంటనే అందే ఏర్పాటు చేస్తాం.. అధికారులంతా మీకు సహకరిస్తారు.. రాష్ట్రంలో అందరి దృష్టీ ఆ ఎన్నికపైనే ఉండాలి' అని 'ముఖ్య' నేత కొందరు టీడీపీ నేతలకు పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికపై దిశా నిర్దేశం చేయడం వల్లే కొద్ది రోజులుగా ఇక్కడ అరాచకం రాజ్యమేలుతోంది. స్థానిక టీడీపీ నేత బీటెక్ రవి, మరికొందరు నేతలు రెచ్చిపోతున్నారని స్పష్టమవుతోంది. ఈ క్రమంలో చోటు చేసుకున్న వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు, తప్పుడు కేసులు, భయభ్రాంతులకు గురి చేయడాలు, ప్రలోభాలు.. ఇలా ఏవీ ఫలితమివ్వక పోవడంతో తాజాగా మరో కుట్రకు తెరలేపారు. ఉప ఎన్నికలో ఓటింగ్ శాతం తగ్గించి, అధికార టీడీపీకి మేలు చేకూర్చాలన్న కుట్రలకు పదును పెడుతున్నారు. ఏ గ్రామంలోని ఓటర్లు ఆ గ్రామంలోనే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం లేకుండా అక్కడి ఓట్లు ఇక్కడికి, ఇక్కడి ఓట్లు అక్కడికి మార్చేస్తున్నారు. పులివెందుల మండలంలోని ఎర్రబల్లె కొత్తపల్లె పంచాయతీలో 6, 7 నంబర్ల పోలింగ్ బూత్‌లు, నల్లగొండువారిపల్లెలో పోలింగ్ బూత్ 8, నల్లపురెడ్డిపల్లెలో 9, 10, 11 బూత్‌లు ఉన్నాయి. ఇది వరకు ఏ గ్రామానికి చెందిన ఓటర్లు ఆ గ్రామంలోని పోలింగ్ బూత్‌లలో ఓటు హక్కు వినియోగించుకునే వారు. తాజాగా ఎర్రబల్లె కొత్తపల్లె ఓటర్లు నల్లపురెడ్డిపల్లె బూత్‌లలో, నల్లపురెడ్డిపల్లె ఓటర్లు ఎర్రబల్లె కొత్తపల్లె బూత్‌ల పరిధిలోకి వచ్చేలా అధికారులు మార్పిడి చేశారు. ఓటర్ల పరిశీలన (వెరిఫికేషన్) సందర్భంగా ఈ విషయం బహిర్గతం కావడంతో పలువురు అవాక్కవుతున్నారు. ఇలాగైతే తాము మూకుమ్మడిగా పోలింగ్ బహిష్కరిస్తామని నల్లగొండువారిపల్లె గ్రామస్తులు అధికారులకు తేల్చి చెప్పారు. ఎప్పుడూ లేనిది ఇప్పుడే ఎందుకు ఇలా మార్చారని ఆరా తీస్తే.. టీడీపీ నేతల కుట్రను అధికారులు అమలు చేస్తున్నారని స్పష్టమైంది.

పోలింగ్ శాతం తగ్గించడమే లక్ష్యం

పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలో మొత్తం 10,601 ఓట్లు ఉన్నాయి. అందులో కణంపల్లె, కొత్తపల్లె, నల్లపురెడ్డిపల్లె పంచాయతీల్లో 65 శాతం ఓటర్లు ఉన్నారు. ఆయా పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీకి గట్టి పట్టు ఉంది. ఈ పరిస్థితిలో అక్కడి ఓటర్లు ఓట్లు వేస్తే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపు సునాయాసం. ఈ క్రమంలో ఓటర్ల బూత్‌లను తారుమారు చేశారు. దీంతో స్వల్ప వివాదాలు తలెత్తినా.. అంత దూరం వెళ్లి ఓటు వేసేందుకు ఓటర్లు స్వతహాగా నిరాసక్తత చూపుతారన్నది అధికార పార్టీ నేతల ఎత్తుగడ. పైగా ఓటింగ్ వెళ్లే దారిలో ప్రలోభ పెట్టేందుకు, భయభ్రాంతులకు గురిచేసేందుకు అవకాశం ఉంటుందని కూడా ఎత్తు వేసినట్లు తెలుస్తోంది. దీంతోపాటు ఓటర్లను పెద్ద ఎత్తున ప్రలోభాలకు గురి చేయడం మొదలెట్టారు. ఇంకోవైపు వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి పడిన ఓట్లు ఎక్కువగా చెల్లనివిగా చేసేందుకు బ్యాలెట్ పేపర్ ముద్రించడంలో కూడా ఎత్తుగడలు వేశారని తెలుస్తోంది. 11 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున ఒక్క పేజీలో బ్యాలెట్ పేపర్ ముద్రిస్తే సరిపోతుంది. అలా కాకుండా డబుల్ సైడ్ గుర్తులు ఇస్తూ బ్యాలెట్ ముద్రించేందుకు అధికారులు సిద్ధమైనట్లు సమాచారం. తద్వారా ఒకటవ గడిలో ఉన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డి గుర్తుపై ఓటు వేయడం ద్వారా ఆ ఓటు చెల్లకుండా పోవాలనే కుట్ర దాగి ఉంది. 'ప్రజాస్వామ్యానికి ఓటే పునాది. మెరుగైన సమాజం కోసం ఓటు అనే ఆయుధాన్ని ప్రయోగించండి. ప్రతి ఒక్కరూ పోలింగ్‌లో పాల్గొనండి.. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి' అన్న ప్రచారానికి భిన్నంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. ఎలాగైనా సరే గెలవడానికి ఓటర్లను గందరగోళానికి గురి చేసి, పోలింగ్ కేంద్రం వద్దకు రాకుండా చేయాలన్న ప్రభుత్వ పెద్దల కుతంత్రానికి అధికారులు వత్తాసు పలుకుతున్నారు.

రోజుకో దాడితో భయభ్రాంతులకు గురిచేసే ఎత్తుగడ

వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక వేళ చంద్రబాబు అండ్ గ్యాంగ్ బరితెగించి కుట్రలు, కుతంత్రాలకు తెర లేపింది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగితే గెలుపు దరిదాపులకు వెళ్లడం అటుంచి.. డిపాజిట్ కూడా దక్కదనే విషయం తెలిసి దౌర్జన్యం, రౌడీయిజంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేసేందుకు విఫల యత్నం చేస్తోంది. ప్రజల్లోనూ ఆందోళన, అలజడి సృష్టించడమే లక్ష్యంగా రోజుకో రీతిలో దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. వైఎస్సార్‌సీపీకి గట్టి పట్టు ఉన్న ఈ మండలంలో ఎలాగూ గెలవలేమని తెలిసినా.. సామ దాన భేద దండోపాయాలతో నెగ్గాలని బరితెగిస్తోంది. ఈ క్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలపై తొలుత దాడులకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా మంగళవారం పులివెందుల శ్రీకర్ ఫంక్షన్ హాల్‌లో వివాహానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నేతలు సైదాపురం సురేష్‌కుమార్‌రెడ్డి (చంటి), అమరేష్‌రెడ్డి, నాగేష్, శ్రీకాంత్, తన్మోహన్‌రెడ్డిలపై టీడీపీ రౌడీ మూకలు హత్యాయత్నం చేశాయి. అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి, మహబూబ్‌బాషా (కిరికిరి బాషా) ముఠా దాడి చేసి వెళ్లిపోయింది. ఈ దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. ఏమాత్రం పట్టించుకోలేదు. బుధవారం నల్లగొండువారిపల్లెలో ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రామలింగారెడ్డిపై బందిపోటు దొంగల ముఠా తరహాలో టీడీపీ రౌడీ మూకలు మెరుపు దాడి చేశాయి. ఒక్కసారిగా దాదాపు 100 మంది రాడ్లు, కర్రలు, ఇతర మారణాయుధాలతో వారిని చుట్టుముట్టి మట్టు బెట్టేందుకు యత్నించారు. వేల్పుల రామలింగారెడ్డి తలపై రాడ్డుతో కొట్టారు. దీంతో తల పగిలి ఆయన కింద పడిపోయారు. పక్కనే ఉన్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పైనా అదే స్థాయిలో దాడి చేశారు. రమేష్ యాదవ్ తల తిప్పడంతో భుజంపై రాడ్ల దెబ్బలు పడ్డాయి. ఎమ్మెల్సీ రేంజ్ రోవర్, వేల్పుల రామలింగారెడ్డికి చెందిన ఫార్చ్యూనర్, స్కార్పియో వాహనాలనూ సమ్మెటలతో ధ్వంసం చేశారు. రామలింగారెడ్డి ఉన్న ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించబోయారు. గ్రామస్తులు ప్రతిఘటించేందుకు సిద్ధమవడంతో రౌడీ మూకలు పారిపోయాయి. ఈ ఘటన చోటుచేసుకున్న ప్రాంతానికి సమీపంలోనే పోలీసు క్యాంప్ ఉన్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోక పోవడం గమనార్హం. పైగా టీడీపీ నేతల ఎదురు ఫిర్యాదుతో బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్నారు. అతిచిన్న చిన్న కారణాలతో వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు ఎంతగా బరితెగించి దాడులు చేస్తున్నా, పోలీసులు, ఇతర అధికారులు వారికి అండగా ఉంటున్నారు.

శాశ్వత న్యాయమూర్తులుగా నలుగురు

- జస్టిస్ హరినాథ్, జస్టిస్ కిరణ్మయి, జస్టిస్ సుమతి, జస్టిస్ విజయ్ నియామకం


జస్టిస్ హరినాథ్


జస్టిస్ కిరణ్మయి


జస్టిస్ సుమతి


జస్టిస్ విజయ్

సాక్షి, అమరావతి: ఏపీ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ నూనెపల్లి హరినాథ్, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలను నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయ శాఖ సంయుక్త కార్యదర్శి జగన్నాథ్ శ్రీనివాసన్ నోటిఫికేషన్ జారీ చేశారు. శాశ్వత న్యాయమూర్తులుగా వీరితో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ వచ్చే వారం ప్రమాణం చేయించనున్నారు. జస్టిస్ హరినాథ్, జస్టిస్ కిరణ్మయి, జస్టిస్ సుమతి, జస్టిస్ విజయ్‌లు 2023 అక్టోబర్ 21న హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు. ఆ పదవీ కాలం ఈ నెల 20వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో వీరిని శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలంటూ ఇటీవల సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. వీరి నియామకంతో హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తుల సంఖ్య 24కి చేరింది.

గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా తెలంగాణ

- ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- జపాన్ కంపెనీ తోషిబా ప్లాంట్‌కు భూమిపూజ



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: తెలంగాణను గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా రుద్రారంలోని జపాన్ కంపెనీ తోషిబా ట్రాన్స్ మిషన్ – డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ (ఇండియా) పరిశ్రమలో రూ.347 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన కొత్త ప్లాంట్ల విస్తరణకు శుక్రవారం జరిగిన భూమి పూజ కార్యక్రమంలో శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనతికాలంలోనే తెలంగాణ తయారీరంగంలో దేశానికి దిక్సూచిగా మారిందన్నారు. 2024–25లో దేశ పారిశ్రామికోత్పత్తి రూ.2.77 లక్షల కోట్లు కాగా, ఇందులో తయారీ రంగం వాటా 48 శాతం ఉంటుందన్నారు. ఈ తొమ్మిది నెలల్లోనే రూ.లక్ష కోట్ల విలువైన పారిశ్రామికోత్పత్తి రాష్ట్రం నుంచి ఎగుమతి అయ్యాయన్నారు. తోషిబాలాంటి దిగ్గజ సంస్థలను తెలంగాణకు ఆహ్వానించేందుకు ప్రత్యేకంగా గ్రీన్ ఎనర్జీ ఎక్విప్‌మెంట్ జోన్లు ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో కొత్త పరిశ్రమలను తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటోందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జపాన్ పర్యటన సందర్భంగా రూ.562 కోట్ల పెట్టుబడులకు సంబంధించి తోషిబా కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ చేసుకుందని గుర్తు చేశారు.

పరిశ్రమలతో మెరుగైన ఉపాధి: మంత్రి వివేక్

కొత్త పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి మరిన్ని పెట్టుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఐటీ శాఖ స్పెషల్ సీఎస్ సంజయ్‌కుమార్, జపాన్ ఎంబసీ ఎకనామిక్ – డెవలప్‌మెంట్ మంత్రి కియోకీ హోకుగో, తోషిబా వైస్‌ప్రెసిడెంట్ హిరోషి కనేట, కలెక్టర్ ప్రావీణ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

సీహెచ్‌పీలో తనిఖీ చేసిన డైరెక్టర్


మాట్లాడుతున్న సింగరేణి డైరెక్టర్ వెంకన్న

సత్తుపల్లి: సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌ను శుక్రవారం సింగరేణి డైరెక్టర్(ఎగ్జిక్యూటివ్) బి.వెంకన్న తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బొగ్గు రవాణా, నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం సింగరేణి, రైల్వే అధికారులతో సమావేశమయ్యారు. రైలు మార్గం ద్వారా బొగ్గు రవాణాను మరింత పెంచాలని సింగరేణి అధికారులకు, ఖాళీ వ్యాగన్లను సకాలంలో అందించాలని రైల్వే అధికారులకు సూచించారు. కొత్తగూడెం ఏరియా జీఎం షాలేంరాజు, ఉద్యోగులు సూర్యనారాయణరాజు, ప్రహ్లాద్, నర్సింహారావు, సోమశేఖర్ రావు, మదన్‌మోహన్, తౌర్య, రవికుమార్, ఏ.రాజేంద్రబాబు, కేవై.పాషా పాల్గొన్నారు.

'సైబర్' ముఠాలో వేదాంతపురం వాసి

- ఉపాధి కోసం కాంబోడియా వెళ్లిన అన్నదమ్ములు
- మంచిర్యాల జిల్లా వాసికి డబ్బు ఎరవేసిన ఒకరు
- ఆపై జన్నారం కేంద్రంగా సైబర్‌నేరాలు



అశ్వారావుపేట మండలంలోని వేదాంతపురం గ్రామం

అశ్వారావుపేటరూరల్: అమాయకులను నమ్మించి రూ.కోట్లలో కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్ల ముఠాలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని వేదాంతపురం గ్రామవాసి ఉన్నట్లు బయటపడడం సంచలనం కలిగించింది. కొద్ది రోజులుగా పరారీలో నిందితుడి కోసం సైబర్ సెక్యూరిటీ బ్యూరో బృందం అధికారులు గ్రామంలో గురువారం రాత్రి విచారణ చేపట్టిన విషయం శుక్రవారం వెలుగుచూసింది.

అక్కడ పట్టుబడడంతో..

మంచిర్యాల జిల్లా జన్నారం కేంద్రంగా పెద్దత్తున సైబర్ నేరాలు జరుగుతున్నట్లు సమాచారం అందగా గత నెల 30వ తేదీన పోలీసులు కొందరిని అరెస్టు చేశారు. విచారణలో అశ్వారావుపేట మండలం వేదాంతపురం గ్రామానికి చెందిన అన్నదమ్ముల్లో ఒకరు ప్రధాన పాత్రధారిగా ఉన్నట్లు గుర్తించారు. ఆయన కోసం సైబర్ సెక్యూరిటీ బ్యూరో బృందం గాలిస్తుండగా గురువారం రాత్రి గ్రామంలోని వారి నివాసంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అన్నదమ్ములు తక్కువ సమయంలోనే ఆదాయానికి మించి ఆస్తులు కూడగట్టినట్లు గుర్తించారని సమాచారం.

వేదాంతపురం టు కాంబోడియా

పదో తరగతి, ఇంటర్ అభ్యసించిన వేదాంతపురానికి చెందిన అన్నదమ్ములు మూడేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం కాంబోడియా దేశానికి వెళ్లారు. వీరిద్దరు అక్కడ హోటల్‌లో పనిచేస్తుండగా ఒకరికి సైబర్ నేరగాళ్లతో పరిచయం ఏర్పడినట్లు తెలిసింది. వారి నుంచి యంత్రాలు సమకూర్చుకున్నట్లు సమాచారం. ఆపై మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడగా.. సదరు వ్యక్తి స్వగ్రామానికి వెళ్లే క్రమాన సైబర్ నేరాలతో రూ.కోట్లు సంపాదించవచ్చని ఆశ చూపాడని తెలిసింది. నేరాల్లో ఉపయోగపడే యంత్రాలను తీసుకెళ్లాలని సూచించగా సదరు వ్యక్తి స్వగ్రామానికి చేరుకున్నాడు. ఆపై కాంబోడియాలో ఉన్న ప్రధాన నిందితుడి సూచనల మేరకు జన్నారంలోని బంధువుల ఇంట్లో గది అద్దెకు తీసుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు ఢిల్లీకి చెందిన టెలీ కమ్యూనికేషన్ శాఖ అధికారులు గుర్తించారు. ఈమేరకు జన్నారంలో ముఠాను పోలీసులు అరెస్ట్ చేయగా.. సూత్రధారి వేదాంతపురం వాసి అని తేలడంతో సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయమై అశ్వారావుపేట ఎస్సై యయాతిరాజును వివరణ కోరగా.. సైబర్ నేరం ఘటనలో వేదాంతపురం వాసిపై మంచిర్యాల జిల్లాలో కేసు నమోదైందని, సైబర్ సెక్యూరిటీ బ్యూరో బృందం విచారిస్తుండగా.. తమ పరిధిలో లేదని వెల్లడించారు.

జవహర్ లిఫ్ట్ వద్ద సిద్ధమైన ఫైలాన్

రేపు శంకుస్థాపన చేయనున్న డిప్యూటీ సీఎం


ఫైలాన్ పనులను పరిశీలిస్తున్న నాయకులు

మధిర: ఖమ్మం జిల్లాలోని మధిర, ఎర్రుపాలెం మండలాలను ఎన్నెస్పీ సెకండ్ జోన్‌లోకి మార్చి సాగునీటి సరఫరా కోసం రూ.630.30 కోట్ల నిధులతో జవహర్ ఎత్తిపోతల పథకం నిర్మించనున్నారు. ఈ పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. మధిర మండలం వంగవీడులో ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు శంకుస్థాపన చేయనున్న భట్టి, మంత్రులు ఆతర్వాత బహిరంగ సభలో ప్రసంగిస్తారు. కాగా, శంకుస్థాపన ప్రదేశం వద్ద ఫైలాన్‌ను నిర్మించగా మార్కెట్, ఆత్మ కమిటీల చైర్మన్లు బండారు నరసింహారావు, కర్నాటి కోటేశ్వరరావు అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణ రెడ్డి, కాంగ్రెస్ వివిధ మండలాల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, సూరంసెట్టి కిషోర్, గాలి దుర్గారావు, శీలం శ్రీనివాసరెడ్డి, నాయకులు అనుమోలు వెంకటకృష్ణారావు, కడియం శ్రీనివాసరావు, దేవరకొండ రాజీవ్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ రంగంలో పెనుమార్పులు

ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్


మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్

ఖమ్మంగాంధీచౌక్: బ్యాంకింగ్ రంగంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ అధ్యక్షుడు శ్రీధర్ తెలిపారు. ఖమ్మంలో రెండు రోజులుగా జరుగుతున్న యూనియన్ వర్కింగ్ కమిటీ సమావేశాలు శుక్రవారం ముగిశా యి. ఈ ముగింపు సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో వస్తున్న మార్పులు అధికారులు, ఉద్యోగులపై భారంగా పరిణమించాయని చెప్పారు. ఈ కారణంగా పనిభారం, ఒత్తిడి పెరిగి సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అయితే, పెరిగిన భారానికి అనుగుణంగా ప్రోత్సాహకం లేకపోవడం మరింత ఆవేదన కలిగి స్తోందని చెప్పారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాండిల్య మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందన్, ఖమ్మం జిల్లా రీజనల్ కార్యదర్శి చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర నలుమూలల నుంచి 100 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

మాయమాటలతో కాంగ్రెస్ గారడీ

బీజేపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి, పక్కన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలతో గారడీ చేస్తూ పాలనను గాలికొదిలేసిందని బీజేపీ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు అధికారమే పరమావధిగా హామీలు ఇచ్చి వాటి అమలును గాలికొదిలేశారని ఆరోపించారు. రైతుల రుణమాఫీ పూర్తిగా అమలు కాకపోగా, హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందడం లేదని, నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ప్రభుత్వం మోసం చేసిందని, కేంద్రం నిధులు ఇస్తుంటే.. కాంగ్రెస్ శ్రేణులకు ఇళ్లు కేటాయిస్తున్నారని సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళా నాయకులు ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈసమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, నాయకులు గెంటెల విద్యాసాగర్, సన్నె ఉదయ్‌ప్రతాప్, గోంగూర వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, నున్నా రవికుమార్, అల్లిక అంజయ్య, మండడపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విత్తకుండానే పంట పండింది!


రైతు ఇంట్లో పెసల రాశి(ఇన్‌సెట్) జూలకంటి సంజీవరెడ్డి

ముదిగొండ: రబీలో ఆరు తడి పంటల సాగు మంచిదన్న వ్యవసాయశాఖ అధికారుల సూచనలతో ఓ ఆదర్శ రైతు గడిచిన రబీలో మూడెకరాల్లో పెసర సాగు చేశాడు. అదేస్థలంలో రెండు పంట కూడా తీసిన సదరు రైతు ఔరా అనిపించాడు. వివరాల్లోకి వెళ్తే... ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం మేడేపల్లికి చెందిన ఆదర్శ రైతు జూలకంటి సంజీవరెడ్డి గత 30ఏళ్లుగా పంట మార్పిడి విధానం పాటిస్తూ ఆరు తడి పంటలు సాగు చేస్తున్నాడు. గత రబీలోనూ మూడెకరాల్లో పెసర సాగు చేశాడు. బోరు సాయంతో నీరందించగా 20క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అయితే, పంట తీసిన కొద్దిరోజులకే చేనును బోరు నీటితో తడిపాడు. దీంతో వారం వ్యవధిలోనే రాలిన గింజల ద్వారా మళ్లీ పెసర మొక్కలు మొలకెత్తాయి. ఆపై చీడపీడలు ఆశించకుండా కాపాడడంతో ఇటీవల పది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో క్వింటా పెసలకు రూ.7వేల నుంచి రూ.8వేల ధర ఉండగా.. ఒకేసారి విత్తనంతో రెండు పంటలు తీసిన సంజీవరెడ్డిని పలువురు అభినందిస్తున్నారు.

పింఛన్ పెంపు హామీ అమలెప్పుడు?

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ


కూసుమంచి : సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ

వైరా/కూసుమంచి/మధిర: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు చేయూత పింఛన్ మొత్తాన్ని పెంచుతామంటూ ఇచ్చిన హామీని ఇకనైనా అమలుచేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. దివ్యాంగుల పింఛన్లు పెంచాలనే డిమాండ్‌తో వైరా, కూసుమంచి మండలం జీళ్లచెరువు, మధిర మార్కెట్ యార్డులో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. దివ్యాంగు పింఛన్‌ను రూ.4వేల నుంచి రూ.6 వేలకు, వితంతువులు, వృద్ధులు, చేనేత కార్మికులు, గీత కార్మికులకు రూ.2వేలను రూ.4 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ప్రభుత్వం ఒత్తిడి తీసుకొచ్చేలా త్వరలోనే హైదరాబాద్‌లో నిర్వహించే సభకు జిల్లా నుంచి దివ్యాంగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈసమావేశాల్లో నాయకులు కారుమంచి వెంకన్న, మాగంటి వెంకటేశ్వర్లు, బత్తుల అంజలి, సంగెపు ఆదినారాయణ, ఎక్కిరాల సుజాత, బానోతు సైదులు, ఆదూరి ఆనందరావు, ఇల్లు వెంకటి, దాసరి కృష్ణవేణి, విలారపు ఉమారాణి, తూరుగంటి అంజయ్య, బెల్లంకొండ రవి, అయినాల కనకరత్నం, సామినేని భవానీచౌదరి, అజ్మీరా భారతి, బొజ్జ జీవరత్నం, పగిడికత్తుల ఈదయ్య, కట్టికోల వెంకటేశ్వర్లు, తోడేటి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



రాఖీ ఆకృతిలో విద్యార్థులు

ముదిగొండ మండలం యడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు శుక్రవారం రాఖీ ఆకృతిలో ప్రదర్శన ఇచ్చారు. ముందస్తుగా రక్షాబంధన్ వేడుకలు నిర్వహించగా.. విద్యార్థులు రాఖీ ఆకృతిలో కూర్చుని ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది. – ముదిగొండ